క్లుప్తంగా

లోక కల్యాణార్థం హోమాలు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): వారాహి నవరాత్రుల్లో భాగంగా ఇంద్రకీలాద్రిపై మంగళవారం విశేష హోమాలను నిర్వహించారు. ఇంద్రకీలాద్రిపై మల్లేశ్వరస్వామి వారి ఆలయం సమీపంలోని యాగశాలలో ఆలయ అర్చకులు పూజా కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. లోక కల్యాణార్థం యాగశాలలో పంచ వారాహి మంత్రాలతో అమ్మవారికి జప, తర్పణ, హోమాలను నిర్వహించారు.

రూ.43 లక్షలతో సీసీ రోడ్ల నిర్మాణం



గాంధీనగర్(విజయవాడసెంట్రల్): భవానీపురం 42వ డివిజన్ పరిధిలో రూ.43 లక్షలతో నిర్మిస్తున్న సీసీ రోడ్లకు కార్పొరేటర్ పడిగపాటి చైతన్యరెడ్డి భూమి పూజ చేశారు. డివిజన్‌లోని నేతాజీ స్కూల్ రోడ్డులోని 4 క్రాస్ రోడ్స్, టెలీఫోన్ కాలనీలోని 2 క్రాస్ రోడ్లు సీసీ రోడ్లుగా అభివృద్ధి చేస్తున్నారు. మంగళవారం కార్పొరేటర్ భూమి పూజ చేసి పనులు ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ గత ప్రభుత్వంలోనే 90 శాతం అంతర్గత రోడ్లు సీసీ రోడ్లు నిర్మించామన్నారు. ప్రస్తుతం రూ.43 లక్షలతో రోడ్లకు శంకుస్థాపన చేశామని చెప్పారు. ఏఈ ఖలీల్ బాషా, స్థానికులు పాల్గొన్నారు.

నేడు 'రీ కాలింగ్ చంద్రబాబూస్ మ్యానిఫెస్టో' సదస్సు

లబ్బీపేట(విజయవాడతూర్పు): ఎన్నికల ముందు చంద్రబాబు ఇచ్చిన హామీలు అమలు చేయకపోవడాన్ని ప్రజల్లోకి తీసుకెళ్తూ రీ కాలింగ్ చంద్రబాబూస్ మ్యానిఫెస్టో పేరుతో బుధవారం వైఎస్సార్ సీపీ జిల్లా ప్రతినిధుల సదస్సు నిర్వహిస్తున్నట్లు ఆ పార్టీ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు దేవినేని అవినాష్ తెలిపారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు గురునానక్‌కాలనీలోని ఎన్ఏసీ కళ్యాణ మండపంలో మధ్యాహ్నం 3 గంటలకు జరిగే ఈ సదస్సులో రీజినల్ కోఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి పాల్గొంటారన్నారు. బాబు ష్యూరిటీ మోసం గ్యారంటీ అనే నినాదంతో చంద్రబాబు మ్యానిఫెస్టోను గుర్తుకు తెస్తూ ఈ సమావేశం నిర్వహిస్తున్నామన్నారు. అందరూ హాజరు కావాలని చెప్పారు.

స్టాండింగ్ కమిటీ సభ్యులుగా రెహమతున్నీసా, పూర్ణచంద్రరావు



వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): విజయవాడ నగరపాలకసంస్థ స్థాయీ సంఘ సభ్యులుగా కార్పొరేటర్లు రెహమతున్నీసా, శిరంశెట్టి పూర్ణచంద్రరావులు ఎన్నికయ్యారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పశ్చిమ నియోజకవర్గ కార్పొరేటర్ల సమావేశం ఆ పార్టీ పశ్చిమ ఇన్‌చార్జి వెలంపల్లి శ్రీనివాసరావు అధ్యక్షతన ఆ పార్టీ కార్యాలయంలో మంగళవారం జరిగింది. కార్పొరేటర్లందరూ ఏకగ్రీవంగా 38వ డివిజన్ కార్పొరేటర్ రెహమతున్నీసా, 55వ డివిజన్ కార్పొరేటర్ శిరంశెట్టి పూర్ణచంద్రరావులను స్థాయీ సంఘ సభ్యులుగా ఎన్నుకున్నారు. ఈ మేరకు కార్పొరేటర్ల సమావేశం తీర్మానించింది. మేయర్ రాయన భాగ్యలక్ష్మి, కార్పొరేటర్లు బండి పుణ్యశీల, మండేపూడి ఛటర్జీ, ఇర్ఫాన్, యరడ్ల ఆంజనేయరెడ్డి, చైతన్యరెడ్డి, కోటిరెడ్డి, యలకల చలపతిరావు, గోదావరి గంగ, మైనారిటీ సెల్ నేత షేక్ హయత్ పాల్గొన్నారు.

మద్యం సేవించి వాహనాలు నడిపిన నలుగురికి జైలుశిక్ష

లబ్బీపేట(విజయవాడతూర్పు): నగరంలో మద్యం సేవించి వాహనాలు నడుపుతూ పోలీసుల తనిఖీల్లో పట్టుబడిన నలుగురికి న్యాయస్థానం వారం రోజులు జైలు శిక్ష విధించింది. కమిషనరేట్ పరిధిలోని మూడో ట్రాఫిక్‌పీఎస్ పరిధిలో నిర్వహించిన తనిఖీల్లో మద్యం సేవించి వాహనాలు నడిపే నలుగురిని గుర్తించారు. వారిని ఏడో అడిషనల్ జ్యుడిషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్‌లో ప్రవేశపెట్టగా న్యాయమూర్తి ఆర్‌వీఎస్ శర్మ ఏడు రోజుల జైలు శిక్ష విధించారు. నగరంలో ప్రతి రోజూ డ్రంక్ అండ్ డ్రైవ్ కార్యక్రమాలు నిర్వహించి పట్టుబడిన వారిపై కేసులు నమోదు చేస్తున్నట్లు సీపీ రాజశేఖరబాబు తెలిపారు.

కార్మికుల సమస్యలను పరిష్కరించాలి

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): నగరపాలక సంస్థ ఇంజినీరింగ్ వర్కర్ల సమస్యలను తక్షణం పరిష్కరించి సమ్మెను విరమింపజేయాలని మున్సిపల్ వర్కర్స్ యూనియన్(సీఐటీయూ) నగర కార్యదర్శి టి.ప్రవీణ్ డిమాండ్ చేశారు. యూనియన్ ఆధ్వర్యంలో ఇంజినీరింగ్ వర్కర్స్ సమస్యలను పరిష్కరించాలని, సమ్మెను విరమింపజేయాలని డిమాండ్ చేస్తూ కొత్తపేట అన్నపూర్ణాదేవి స్కూల్ వద్ద ఉన్న బూస్టర్ వద్ద నిరసన కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రవీణ్ మాట్లాడుతూ గడిచిన 20 రోజులుగా ఇంజినీరింగ్ వర్కర్లు సమ్మె చేపట్టి నిరసన తెలుపుతున్నా ఈ ప్రభుత్వం పట్టించుకోకపోవటం దుర్మార్గమన్నారు. ఉన్న జీవోను అమలు చేసి న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో పలువురు నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.

విష పురుగులు, కీటకాలతో బెంబేలు

- పాత ఆర్‌ఆర్‌పేట వాసులను దడ పుట్టిస్తున్న కీటకాలు
- రోగాల బారిన పడుతున్న ప్రజానీకం
- పట్టించుకోని నగరపాలకసంస్థ అధికారులు



పాత ఆర్‌ఆర్‌పేటలో పేరుకుపోయిన చెత్త

పూర్ణానందంపేట(విజయవాడపశ్చిమ): పాత ఆర్‌ఆర్‌పేట వాసులను విష పురుగులు, కీటకాలు దడ పుట్టిస్తున్నాయి. స్థానిక జ్యుడిషియల్ కాలనీ, కొత్త మసీదు రోడ్డు, మహంకాళీ అమ్మవారి గుడివీధిలో ఉన్న ఖాళీ స్థలాల్లో ముళ్ల పొదలు, విష పురుగులకు ఆవాస కేంద్రాలుగా మారాయి. ఖాళీగా ఉన్న ప్లాట్‌లు చెత్త, చెదారంతో నిండి దుర్గంధం వెదజల్లుతున్నాయి. నివాసాల మధ్య ఉన్న ఈ స్థలాల్లో చెత్త, పనికిరాని వస్తువులు పేరుకుపోతుండటంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని స్థానికులు వాపోతున్నారు.

మినీ డంపింగ్ కేంద్రాలుగా..

పారిశుద్ధ్య సిబ్బంది ఇళ్ల నుంచి నిత్యం సేకరించే వ్యర్థాలను, మృతి చెందిన జీవాలను, చికెన్ షాపుల నుంచి వచ్చే వ్యర్థాలను ఇళ్ల మధ్య ఉన్న ఖాళీ స్థలాల్లో పడేస్తున్నారని స్థానికులు చెబుతున్నారు. దీంతో తీవ్రదుర్గంధం వెదజల్లటమే కాకుండా తరచుగా అనారోగ్యం పాలవుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పేరుకుపోతున్న చెత్తకుప్పలు..

పాత ఆర్‌ఆర్‌పేటలోని ఖాళీ స్థలాల్లో పేరుకుపోయిన చెత్త నిల్వలు మినీ డంపింగ్ కేంద్రాలుగా దర్శనమిస్తున్నాయి. దీంతో ప్రజలు అనారోగ్యం పాలై ఆస్పత్రుల చుట్టూ తిరగాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నిరుపేదలు ఎక్కువగా నివసించే ప్రాంతం కావటంతో పాటు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం కూడా దూరంగా ఉండటంతో రోగాల పాలై ప్రైవేట్ ఆస్పత్రులకు డబ్బు చెల్లించుకునే పరిస్థితి కూడా లేక అవస్థలు పడుతున్నామని చెప్పారు.

ఖాళీ స్థలాలతో అవస్థలు..

జూడిషియల్ కాలనీలో ఉన్న ఖాళీ స్థలాల్లో మురుగు నీరు చేరి దోమలకు నిలయంగా మారుతున్నాయి. దీంతో రాత్రి, పగలు కునుకు లేకుండా పోతుందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనికి తోడు విషపురుగులు ఖాళీ స్థలాల్లో చేరి భయాందోళనకు గురిచేస్తున్నాయని స్థానికులు చెబుతున్నారు. ఎప్పుడు ఏ విషపురుగు ఇళ్లల్లోకి వస్తుందోనని బిక్కుబిక్కుమంటూ గడుపుతున్నామని కాలనీ వాసులు వాపోతున్నారు.



పాత మసీదు వీధిలో ఖాళీ స్థలంలో పెరిగిన పిచ్చి చెట్లు

మొక్కుబడిగా పనులు..

డివిజన్‌లో పారిశుద్ధ్య సమస్య దిగజారుతున్న పారిశుద్ధ్య సిబ్బంది పట్టించుకుంటున్న దాఖలాలు లేవని స్థానికులు మండిపడుతున్నారు. నెలల తరబడి చెత్త, మురుగు నీరు పేరుకుపోతున్న అధికారులు నిమ్మకునీరెత్తనట్లు వ్యవహరించటం పట్ల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఖాళీగా ఉన్న స్థలాల్లో పిచ్చిమొక్కలు పెరిగిపోతున్న వాటి యజమానులు పట్టించుకోకపోవటం, వాటిని శుభ్రం చేసి కనీసం మెరక చేయకపోవటంతో మురుగు నీరు చేరుతుందని చెబుతున్నారు. దీంతో చుట్టుపక్కల ఉన్నవారు రోగాల బారిన పడుతున్నారు. వీఎంసీ అధికారులు సైతం తమకు పట్టనట్లు వ్యవహరిస్తున్నారని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

రథం సెంటర్‌లో సెంట్రల్ రిసెప్షన్ ఆఫీస్



పార్కింగ్ గురించి చర్చిస్తున్న సీపీ రాజశేఖరబాబు, ఈవో శీనానాయక్

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): రథం సెంటర్ నుంచి మహా మండపానికి బ్యాటరీ వాహనాల ఏర్పాటుతో పాటు రథం సెంటర్‌లో సెంట్రల్ రిసెప్షన్ ఆఫీసు ఏర్పాటు చేయనున్నట్లు దుర్గగుడి ఈవో శీనానాయక్ పేర్కొన్నారు. నగర పోలీస్ కమిషనర్ రాజశేఖర్‌బాబు మంగళవారం ఇంద్రకీలాద్రికి విచ్చేయగా, ఆలయ పరిసరాల్లో తొలగించిన ఆక్రమణలను ఈవోతో కలిసి పరిశీలించారు. కుమ్మరిపాలెంలో టీటీడీకి చెందిన స్థలాన్ని పరిశీలించి భవిష్యత్తు అవసరాల దృష్ట్యా ఏ విధమైన చర్యలు తీసుకోవాలనే దానిపై ఇంజినీరింగ్ అధికారులతో చర్చించారు. పున్నమి ఘాట్, భవానీ ఘాట్స్‌లో వాహనాల పార్కింగ్ గురించి చర్చించారు. మున్సిపల్ కార్యాలయం వద్ద త్వరలో హోల్డింగ్ పాయింట్ అభివృద్ధితో పాటు అక్కడి నుంచి భక్తులను దేవస్థాన బస్సుల్లో ఇంద్రకీలాద్రికి తరలింపు అంశంపై దేవస్థాన ఈఈతో చర్చించారు. అనంతరం ఇంద్రకీలాద్రికి చేరుకున్న సీపీ రాజశేఖరబాబు అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ ఈవో శీనానాయక్ సీపీకి అమ్మవారి చిత్రపటం, ప్రసాదాలను అందజేశారు. సీపీ వెంట డీసీపీ జి.రామకృష్ణ, వెస్ట్ ఏసీపీ దుర్గారావు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

బైక్‌పై నుంచి పడి గాయాలు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): బైక్‌పై నుంచి జారిపడి మహిళకు గాయాలైన ఘటన కొత్తపేట పోలీస్ స్టేషన్ పరిధిలో మంగళవారం చోటుచేసుకుంది. ఘటనపై బాధితురాలి బంధువులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం రాజీవ్‌నగర్‌కు చెందిన కావేటి సుందరరావు తన అమ్మమ్మ లక్ష్మితో కలిసి కంచకచర్ల సమీపంలోని దాసారం గ్రామానికి వెళ్లారు. పెన్షన్ డబ్బులు తీసుకున్న తర్వాత బైక్‌పై తిరిగి విజయవాడ బయలుదేరారు. పాముల కాల్వ సమీపంలో రోడ్డుపై స్పీడ్ బ్రేకర్ వద్ద లక్ష్మి అదుపు తప్పి బైక్‌పై నుంచి కిందపడింది. దీంతో ఆమె తలకు గాయం కావడంతో చెవులు, ముక్కు నుంచి రక్తం రావడంతో హుటాహుటిన విజయవాడ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఘటనపై సమాచారం అందుకున్న కొత్తపేట పోలీసులు కేసు నమోదు చేశారు.

ఉత్సాహంగా సీఏ డే వేడుకలు



రక్తదానం చేస్తున్న సీఏలు

మొగల్రాజపురం(విజయవాడతూర్పు): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు సకాలంలో పన్నులు చెల్లించేలా చేస్తూ చార్టర్డ్ అకౌంటెంట్‌లు వారు జీవనోపాధిని పొందడమే కాకుండా దేశ, రాష్ట్ర అభివృద్ధిలో భాగస్వాములు కావడం ఎంతో ఆనందంగా ఉందని ది ఇనిస్టిట్యూట్ ఆఫ్ చార్టర్డ్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా(ఐసీఏఐ) విజయవాడ బ్రాంచ్ చైర్మన్ కంచమరెడ్డి నారాయణ అన్నారు. సీఏ ఫౌండేషన్ డే సందర్భంగా స్థానిక ఐసీఏఐ భవన్‌లో సీఏ డే వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. కార్యాలయం ఆవరణలో జెండాను ఆవిష్కరించిన అనంతరం నారాయణ మాట్లాడుతూ ప్రభుత్వానికి సకాలంలో సక్రమంగా పన్నులు చెల్లించేలా చేయడంలో సీఏల పాత్ర చాలా కీలకమని చెప్పారు. సీఏ ఫౌండేషన్ డే సందర్భంగా పాదయాత్ర, క్లీన్ అండ్ గ్రీన్, మొక్కలు నాటడం, రక్తదాన శిబిరాల్లో అధిక సంఖ్యలో ఐసీఏఐ సభ్యులు పాల్గొన్నారు. 42 మంది రక్తదానం చేశారు. ఐసీఏఐ విజయవాడ బ్రాంచ్ వైస్ చైర్మన్ జయంత్ ఉప్పులూరి, కార్యదర్శి మనీష్ కుమార్ జైన్, కోశాధికారి వి.వీరపవన్‌కుమార్, సికాసా చైర్మన్ టి.వినీలా, ఎంసీ సభ్యులు దామా వేణు, అజయ్ చౌదరి బొర్రా, బ్రాంచ్ సభ్యులు, మాజీ అధ్యక్షులు, సీఏ విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా వైద్యులకు సత్కారం



రైల్వే ఆస్పత్రి వైద్యులను సత్కరించిన పెన్షనర్స్ అసోసియేషన్ నేతలు

రైల్వేస్టేషన్(విజయవాడపశ్చిమ): జాతీయ వైద్యుల దినోత్సవాన్ని పురస్కరించుకుని పెన్షనర్స్ అసోసియేషన్ ఆఫ్ రైల్వే వ్యాగన్ వర్కుషాప్ ఆధ్వర్యంలో మంగళవారం విజయవాడ డివిజనల్ రైల్వే ఆస్పత్రిలో వైద్యులను సత్కరించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ సెక్రటరీ చాంద్ బాషా మాట్లాడుతూ విజయవాడ రైల్వే ఆస్పత్రిలో ప్రతి రోజు రోగుల సంఖ్య పెరుగుతున్నా అందుకు తగినట్లుగా వైద్యులు సకాలంలో వైద్య సేవలు అందిస్తున్నారని కొనియాడారు. రైల్వే ఆస్పత్రిలో అందుబాటులో లేని న్యూరో, పల్మనాలజీ, కార్డియాలజీ, గ్యాస్ట్రో ఎంటరాలజీ వైద్యులను కన్సల్టెంట్లుగా పిలిపించి రోగులకు వైద్యం చేస్తున్నట్లు తెలిపారు. ఇటువంటి సేవలు అందిస్తున్న వైద్యులను సత్కరించుకోవడం గర్వంగా ఉందన్నారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి సీఎంఎస్ డాక్టర్ రవికాంత్ మాట్లాడుతూ రైల్వే పెన్షనర్స్ అసోసియేషన్ ప్రతి ఏడాది వైద్యులను సత్కరించడం అభినందనీయమన్నారు. విశ్రాంత ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యుల ఆరోగ్య విషయంలో అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో అసోసియేషన్ చైర్మన్ ఎం.వీరాస్వామి, ఎంఎస్ఎం శ్యాంబాబు, నాగభూషణం, హనుమంతరావు, కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

విలీన సిబ్బంది సమస్యలు పరిష్కరించండి

మధురానగర్(విజయవాడసెంట్రల్): ఏపీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విధులు నిర్వహిస్తున్న విలీన అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని ప్రభుత్వ కళాశాలల అధ్యాపకుల సంఘం రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు డాక్టర్ గోవిందు సురేంద్ర, డాక్టర్ కొల్లేటి రమేష్ మంగళవారం ఓ ప్రకటనలో కోరారు. గతంలో ఎయిడెడ్ కళాశాల నుంచి ప్రభుత్వ కళాశాలలకు సుమారు 2,000 మంది అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బందిని ప్రభుత్వ కళాశాలలోకి విలీనం చేశారన్నారు. అయితే వీరికి ఇంతవరకూ సర్వీస్ నిబంధనలు రూపొందించకుండా ఎటువంటి ప్రయోజనాలను, ప్రమోషన్లను కల్పించకుండా కేవలం బోధన, బోధనేతర పనులకు మాత్రమే అధికారులు ఉపయోగిస్తున్నారని విచారం వ్యక్తం చేశారు. గత ప్రభుత్వం కల్పించిన విలీన విధానంలోని నాలుగో ఆప్షన్ ద్వారా కొంతమంది తిరిగి ఎయిడెడ్ సర్వీస్‌లోకి వెళ్లారు. కొందరు ప్రభుత్వ సర్వీస్‌లోనే కొనసాగుతామని కోర్టుకు వెళ్లి స్టే తెచ్చుకున్నారు. అయినా వీరిని బలవంతంగా, ఎలాగైనా ఎయిడెడ్‌కు పంపించేయాలని భావిస్తున్న కళాశాల విద్యాశాఖలోని కొందరు అధికారుల ఎత్తుగడలకు, కుట్రలకు బలై పోతున్న విలీన సిబ్బందికి సమాన సర్వీస్ ఇచ్చి, వీరిని ప్రభుత్వంలోనే కొనసాగే విధంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. విలీన సిబ్బంది సమస్యలపై విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ దృష్టి సారించి సమస్యలను పరిష్కరించి విలీన సిబ్బందికి బదిలీలు, ఇతర విధులలో సమాన అవకాశాలు కల్పించాలని కూటమి ప్రభుత్వాన్ని కోరారు.

వృత్తి నైపుణ్యాలను పెంపొందించుకోవాలి

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): అధ్యాపకులు వృత్తి నైపుణ్యాలను పెంపొందించుకున్నప్పుడే విద్యార్థులకు మరింత మేలు జరుగుతుందని నిట్ వరంగల్ కంప్యూటర్ కంప్యూటర్ విభాగ ఆచార్యులు డాక్టర్ పి.వెంకటసుబ్బారెడ్డి అన్నారు. పొట్టిశ్రీరాములు చలువాది మల్లికార్జునరావు కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ, జేఎన్‌టీయూ కాకినాడ సంయుక్త ఆధ్వర్యంలో కంప్యూటర్స్ విభాగ అధ్యాపకులకు క్వాంటం కంప్యూటింగ్ అల్గరిథం, అనువర్తనాలపై ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్‌ను మంగళవారం ప్రారంభించారు. ఐదు రోజుల పాటు జరిగే ఈ కార్యక్రమంలో కంప్యూటర్స్ విభాగ అధ్యాపకులు పాల్గొనున్నారు. కళాశాల కార్యదర్శి చిట్టా అమర్‌సుధీర్ మాట్లాడుతూ అధ్యాపకుల సమగ్ర అభివృద్ధి కోసం వివిధ కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని చెప్పారు. ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.శరవణకుమార్, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఏ.పతంజలిశాస్త్రి, ఐక్యూఏసీ కన్వీనర్ డాక్టర్ ఏ.శ్రీనివాస్, సీఎస్ఈ, ఐవోటీ విభాగాధిపతులు దుర్గాప్రసాద్, పి.శిల్ప పాల్గొన్నారు.

భవానీ ఐలాండ్ ప్రైవేటైజేషన్‌ను ఆపాలి

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): నగర ప్రజలకు ఆహ్లాదాన్ని పంచే భవానీ ఐలాండ్‌ను ప్రైవేట్ పరం చేసేందుకు కూటమి ప్రభుత్వం కుట్రలు చేస్తోందని ఏఐవైఎఫ్ నగర అధ్యక్షుడు కంచర్ల భార్గవ్ అన్నారు. ప్రభుత్వం తీసుకున్న ప్రైవేటీకరణ నిర్ణయాన్ని వెనుకకు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా వన్‌టౌన్ లెనిన్‌భవన్‌లో మంగళవారం ఆయన మాట్లాడారు. భవానీ ఐలాండ్‌ను ప్రైవేటీకరణను చేయడంతో పాటు టూరిజం ఆధ్వర్యంలో నడుస్తున్న హోటల్స్ రిసార్ట్స్ బోటింగ్ పీపీపీ మోడల్‌లో నిర్వహించడానికి ప్రభుత్వం సన్నద్ధమవుతుందని చెప్పారు. కూటమి ప్రభుత్వం నిర్ణయాలను ఉపసంహరించుకోవాలన్నారు.

పార్టీ పటిష్టతకు పాటుపడాలి



పదవులు పొందిన నాయకులతో వెలంపల్లి, మేయర్ భాగ్యలక్ష్మి

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పటిష్టతకు పార్టీ శ్రేణులు పాటుపడాలని ఆ పార్టీ పశ్చిమ నియోజకవర్గ ఇన్‌చార్జి వెలంపల్లి శ్రీనివాసరావు అన్నారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో ఇటీవల నూతనంగా నియమితులైన పశ్చిమ నియోజకవర్గ క్లస్టర్ లో వివిధ హోదాలలో పదవులు పొందినవారు వెలంపల్లి శ్రీనివాసరావును కలిసి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా వెలంపల్లి వారిని శాలువాతో సన్మానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలపై ప్రజలను చైతన్యవంతం చేయాలన్నారు. అలాగే పార్టీ ఇచ్చిన పిలుపు మేరకు కార్యక్రమాలను నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి, కార్పొరేటర్లు యలకల చలపతరావు, నాయకులు షేక్ హయత్, సరగడ శంకర్ రెడ్డి, క్లస్టర్ అధ్యక్షులు బొండా నిరీష్, వాస ఆదినారాయణ బాబు, కేసరి కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు

పదవులు పొందిన నాయకులకు అభినందన..

34వ డివిజన్ నుంచి ఇటీవల నూతనంగా నియమితులైన పార్టీ పశ్చిమ నియోజకవర్గ క్లస్టర్‌లో వివిధ హోదాలలో పదవులు పొందిన డేరంగుల మహాలక్ష్మి, శాంసన్ చిన్ని, బాపట్ల లక్ష్మి, షేక్ హసీన, పి.దుర్గ వెలంపల్లిని కలిసి ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా వెలంపల్లి శ్రీనివాసరావు వారిని అభినందించి, పార్టీ బలోపేతానికి కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఏపీఐడీసీ మాజీ చైర్మన్ బండి పుణ్యశీల తదితరులు పాల్గొన్నారు.

విజయవాడ బ్రాండ్ ఇమేజ్ కమిటీ సమావేశం



మాట్లాడుతున్న వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర

పటమట(విజయవాడతూర్పు): రాష్ట్ర రాజధాని అమరావతికి ముఖద్వారంగా ఉన్న విజయవాడ నగరానికి బ్రాండ్ ఇమేజ్ తీసుకువచ్చేందుకు జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ ఆదేశాలతో ఏర్పాటైన కమిటీ సమావేశం మంగళవారం జరిగింది. వీఎంసీ ప్రధాన కార్యాలయంలోని కమిషనర్ చాంబర్లో జరిగిన ఈ సమావేశంలో ప్రజల ద్వారా నగరానికి టైటిల్ ఎంపిక చేసే పోటీలు నిర్వహించాలని అందుకు మరో కమిటీ అవసరమని తీర్మానించారు. ఈ నూతన కమిటీకి చైర్మన్‌గా వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర హెచ్ఎం, సభ్యులుగా ఎన్టీఆర్ జిల్లా డిస్ట్రిక్ట్ రెవెన్యూ ఆఫీసర్, డిస్ట్రిక్ట్ టూరిజం ఆఫీసర్, అసిస్టెంట్ కమిషనర్ ఎండోమెంట్స్, డిస్ట్రిక్ట్ ఇన్ఫర్మేషన్ పబ్లిక్ రిలేషన్స్ ఆఫీసర్, ఏపీ హోటల్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్, ఏపీ చాంబర్స్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ ఫెడరేషన్ అధ్యక్షులు సభ్యులుగా ఉంటారని, ఈ కమిటీ నిర్ణయాన్ని కలెక్టర్‌కు నివేదిస్తామని కమిషనర్ అన్నారు. విజయవాడ ఖ్యాతిని పెంచే బ్రాండ్ ఇమేజ్ టైటిల్‌ను వినూత్న పద్ధతిలో ఆధ్యాత్మికం, పర్యాటకం, నదులను దృష్టిలో పెట్టుకొని మరో టాప్ 10తో నివేదిక సమర్పించాలని చెప్పారు. తదుపరి సమావేశానికి టాప్ 10లో 5 సెలెక్ట్ చేసి, కలెక్టర్‌కు నివేదిక సమర్పించాలన్నారు. సమావేశంలో డిస్ట్రిక్ట్ టూరిజం ఆఫీసర్ ఏ శ్రీశిల్ప, అసిస్టెంట్ కమిషనర్ ఎండోమెంట్స్ నటరాజన్ షణ్ముగం, ఏపీ హోటల్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ స్వామి, ఏపీ చాంబర్స్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ ఫెడరేషన్ ప్రెసిడెంట్ భాస్కరరావు, డిస్ట్రిక్ట్ ఇన్ఫర్మేషన్ పబ్లిక్ రిలేషన్స్ ఆఫీసర్స్ కేవీ రమణరావు, మోహన్ పాల్గొన్నారు.

పెన్షన్ల పంపిణీ ప్రక్రియ త్వరగా పూర్తి చేయాలి



డ్రెయినేజీ పనులను పరిశీలిస్తున్న వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర

పటమట(విజయవాడతూర్పు): విజయవాడ నగరపాలక సంస్థ పరిధిలోని పెన్షన్ల పంపిణీలను సత్వరమే పూర్తి చేయాలని వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర ఆదేశించారు. నగర పర్యటనలో భాగంగా ఆయన మంగళవారం 43వ డివిజన్ ఊర్మిళ సుబ్బారావు నగర్, హెచ్‌బీ కాలనీ ప్రాంతాల్లో పర్యటించి పెన్షన్ లబ్ధిదారులకు ఆధార్ కార్డు, రియల్ టైం బెనిఫిషరీ ఐడెంటిఫికేషన్ సిస్టం యాప్‌లో పరిశీలించి పెన్షన్ నగదు అందించారు. అనంతరం ఆయన ఊర్మిళ సుబ్బారావు నగర్ పరిసర ప్రాంతాల్లో పర్యటించి అక్కడ జరుగుతున్న భూగర్భ డ్రెయినేజీ పనులను పరిశీలించారు. పనులను వేగవంతం చేసి ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకోవడంతో పాటు ట్రాఫిక్ అంతరాయం లేకుండా చూడాలని అధికారులకు చెప్పారు. డ్రెయిన్లలో మురుగు నీరు పారుదల నిరంతరాయంగా జరిగేలా ఎప్పటికప్పుడు అధికారులు పర్యవేక్షించాలని ఆదేశించారు. కమిషనర్ పర్యటనలో అసిస్టెంట్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ అన్నపూర్ణ, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ జె.శ్రీనివాస్, సిబ్బంది పాల్గొన్నారు.

సమ్మె విరమించి విధుల్లో చేరండి

పటమట(విజయవాడతూర్పు): సమ్మె విరమించి విధుల్లో చేరాలని వీఎంసీ కార్మికులకు కమిషనర్ ధ్యానచంద్ర చెప్పారు. వీఎంసీ ప్రధాన కార్యాలయంలోని కమిషనర్ చాంబర్‌లో ఆయన సమ్మెలో ఉన్న కార్మిక సంఘ నాయకులు, ఇంజినీరింగ్ అధికారులతో మంగళవారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం కార్మికుల సమస్యలను పరిష్కరించేందుకు గ్రూప్ ఆఫ్ మినిస్టర్స్ కమిటీని నియమించిందని, ఈ కమిటీ ప్రస్తుతం ఉన్న కార్మికుల సమస్యలను తెలియపరుస్తారని, వారు ఈ సమస్యకు ఒక పరిష్కార మార్గాన్ని తెస్తారన్నారు. వర్కర్లందరూ సమ్మెను విరమించి తిరిగి విధుల్లో చేరాలని కమిషనర్ చెప్పారు. సమావేశంలో చీఫ్ ఇంజినీర్ ఆర్.శ్రీనాథ్‌రెడ్డి, పర్యవేక్షణ ఇంజినీర్(ప్రాజెక్ట్స్) పి.సత్యకుమారి, పలు సంఘాల నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.

వైభవంగా సుబ్రహ్మణ్యస్వామి కల్యాణోత్సవం



కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): షష్ఠిని పురస్కరించుకుని ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలో శ్రీవల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్య స్వామి వారి కల్యాణోత్సవం మంగళవారం వైభవంగా నిర్వహించారు. అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని నటరాజ స్వామి వారి ఆలయ ప్రాంగణంలో శ్రీవల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి వారి ఉత్సవ మూర్తులకు ఆలయ అర్చకులు కల్యాణోత్సవాన్ని జరిపించారు. తొలుత మేళతాళాలు, మంగళవాయిద్యాల నడుమ కల్యాణ వేదిక వద్దకు ఉత్సవమూర్తులను ఊరేగింపుగా తరలించారు. అనంతరం ఉత్సవమూర్తులకు కల్యాణోత్సవాన్ని శాస్త్రోక్తంగా జరిపించారు. స్వామి వారి కల్యాణాన్ని వీక్షించినా, కల్యాణోత్సవంలో పాల్గొన్న భక్తులకు ఇబ్బందులు తొలగిపోతామని, వివాహ యోగం, సంతానయోగం కలుగుతుందని అర్చకులు పేర్కొన్నారు. కల్యాణోత్సవం అనంతరం స్వామి వారి తలంబ్రాలను భక్తులకు పంపిణీ చేశారు. ఆలయ ఈవో శీనానాయక్, పలువురు ఉభయదాతలు, భక్తులు పాల్గొన్నారు. కల్యాణోత్సవంలో పాల్గొన్న ఉభయదాతలకు ప్రత్యేక క్యూలైన్ ద్వారా అమ్మవారి దర్శనానికి అనుమతించారు.